శ్రీః

# శ్రీ కవిసమ్రాట్ విశ్వనాథ సహస్రచంద్ర దర్శన శాంతిపౌష్టికోత్సవం

## (సారథ్య సంఘ కార్యదర్శుల నివేదిక)

సర్వమంగళ మాంగళ్యే శివేసర్వార్థసాధికే
శరణ్యేత్ర్యయంబకే దేవి నారాయణి నమోస్తుతే॥

స్వస్తిశ్రీ నల సం॥ర భాద్రపద బహుళ షష్ఠి మంగళవారము (14-9-76) శ్రీ కనకదుర్గా మల్లేశ్వరావాసమైన విజయవాడలో శ్రీ కవిసమ్రాట్టుల స్వగృహంలో మంగళవాద్యాలతో శాంతిపౌష్టికోత్సవం ప్రారంభమైంది. వారి యింటిముందు 'షామియానా' పచ్చని మామిడి ఆకుల తోరణాలతో—ఉత్సవ సూచక స్వాగత పతాకతో—విద్యుద్దీపాలంకరణ వైభవముతో—మారుతీ నగరములోని శ్రీ విశ్వనాథవారి వీధికే వినూత్న శోభ వచ్చింది.

బ్రాహ్మీ ముహూర్తంలోనే లేచి శ్రీ విశ్వనాథ దంపతులు మంగళస్నానాలు చేసి, ప్రాతరనుష్ఠానాలు తీర్చుకొని, శ్రీ శృంగేరి జగద్గురు శంకరాచార్య మహాస్వామి చరణుల చిత్రపటమునకు వందనములుచేసి, శ్రీ చరణులు పంపిన మంత్రాక్షతలను శిరసాధరించి, ఋత్విక్సహాయముతో వైదిక క్రియాకలాపానికి ఉపక్రమించారు.

అభిజ్ఞులకు తెలిసినదే అయినా—తెలుగుదేశంలో యీ శాంతి పౌష్టికోత్సవాన్ని చేసుకోవడం ఎక్కువగా లేదు. దీన్ని నిర్వహించడానికి శ్రీ శృంగేరీ జగద్గురువుల అనుగ్రహంతో మదరాసునుంచి వచ్చిన వేదవేత్త లిరువురూ, స్థానిక వేదవేత్తలు మువ్వురూ వైదిక కార్యకలాపానికి సిద్ధము చేశారు. పుణ్యాహవాచన, మంటపారాధన, మహాగణపతి హోమము, ఆయుష్యహోమము, నవగ్రహహోమము, అమృతమృత్యుంజయ హోమము కృత్తికా నక్షత్ర జపేష్టి యథావిధిగా నిర్వహింపబడినాయి. ప్రాఙ్ముఖంగా ఉన్న శ్రీ విశ్వనాథవారి ఇంటి ముందు వసారాలో ఈశాన్యదిగ్భాగంలో ఈ క్రతువులు సలక్షణముగా జరిగినవి.

ఉదయం 7 గం॥ నుండి మధ్యాహ్నం 12 గం॥ వరకు పట్టిన ఈ కార్యకలాపంలో వృద్ధకవులు అంతసేపు కూర్చుని ఉండటం సాధ్యంకాదని వారు సమీపంలోనే విశ్రాంతి తీసికొనుచుండగా—వరుణ స్వీకరించి ఋత్విక్కులే క్రతువులు నిర్వహించారు. క్రతువుల కార్యకలాపాన్ని గమనిస్తూ కవిసమ్రాట్టులు సమీపంలో ఆసీనులై ఉండగా—ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని అభినందించడానికి అనేకులు వచ్చి

కానికలు సమర్పించారు. కవిసమ్రాట్టులను పరివేష్టించి ఉత్సవకుతుకాగత సుకవి నికరము సరససాహిత్యగోష్ఠి సాగిస్తూనే ఉన్నారు. ఇటు వైదిక క్రతు నిర్వహణమూ- అటు సరస సాహిత్యగోష్ఠి—దేనికదే దర్శనీయమూ—శ్రావ్యమూ అయి వచ్చినవారికి ఆనందాన్ని సమకూర్చాయి.

ఉత్సవానికి వచ్చిన సాహితీ బంధువులకూ, శ్రీ విశ్వనాథ బంధుకోటికీ సారథ్య సంఘం ఆతిథ్యాన్ని సమకూర్చింది.

భోజనాల అనంతరం సారథ్యసంఘ సమావేశం జరిగింది. కార్యభారంలో అనుభవానికి వచ్చిన సాధకబాధకాలను కార్యదర్శులు వివరించారు. విషయమెంత విశిష్టమూ, సముచితమూ, సకలజనామోదకరమూ—అయినా ఆచరణలోనికి వచ్చేటప్ప టికి ఆశించినంత—సహకారం లభించుట—(అధికారుల ఒత్తిడి లేకపోతే) సాధ్యమే కాదు. వేయిమందికిపైగా సారథ్య సంఘంలో చేరమని ఆహ్వానాలు. అభ్యర్థనలు పంపితే అరవై ఒక్కమంది మాత్రమే చేరారు,

సాహిత్య మాసపత్రిక 'విశ్వనాథశారద' ప్రారంభించడానికి గాని, విశ్వనాథ సాహితీ వైభవం' ప్రకటించడానికి గాని స్తోమతు చేకూరలేదు. ఉత్సవాలు నిర్వహించ డానికి అవసరమైనంత మాత్రం లభించింది. కొందరు ఉత్సాహవంతులు శాశ్వత ప్రాతిపదికతో "విశ్వనాథ సాహితీ సమర్చన నిధి"ని సమకూర్చాలని సూచింపగా అందరి ఆమోదాన్ని పొందింది. శ్రీ భావరాజు నరసింహారావుగారు అప్పటికప్పుడే నడుముకట్టి కార్యరంగములోనికి దిగి నిధికిగాను శతపత్రాలు సమర్పించే సాహితీ భావుకులను సంఘటింప పూనుకున్నారు.

స్థానిక ప్రభుత్వ కళాశాలలో సాయంకాలసభ వేదపఠనముతో ప్రారంభ మైంది. ఆంధ్రప్రదేశ సాంఘిక సంక్షేమ సాంకేతిక విద్యామంత్రులు గౌ॥ శ్రీ భాట్టం శ్రీరామమూర్తిగారు అధ్యక్షత వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయ ఆంధ్ర శాఖాధ్యక్షులు డా. కేతవరపు రామకోటి శాస్త్రిగారు స్వాగతవచనాలు పలికారు. సహస్ర చంద్రదర్శన శాంతిపౌష్టికోత్సవ విధానాన్ని గురించి బోధాయన సూత్రవ్యాఖ్యానంతో ప్రధాన కార్యదర్శి శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు వివరించారు.

శ్రీ శృంగేరీ జగద్గురు చరణుల అనుగ్రహప్రసాదాన్ని బ్రహ్మశ్రీ బ్రహవిద్యా లంకార ముదిగొండ వెంకటరామశాస్త్రిగారు కవిసమ్రాట్టులకు అందించారు. జ్ఞానవయో వృద్ధులు బ్రహ్మశ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు ఔన్నత్యపూర్ణమై సౌజన్య భరితమైన ప్రసంగంచేసి సభను రంజింపచేశారు. మైసూరు విశ్వవిద్యాలయ ఆంధ్ర శాఖాధ్యక్షులు డా. బడాల రామయ్యగారు విశ్వనాథ సాహిత్యవైశిష్ట్యాన్ని గురించి భావావేశంతో వక్తృత్వనైపుణ్యంతో ప్రసంగించి సభ్యుల ఆదరాభిమానాలకు పాత్రు లైనారు. డా. ప్రసాదరాయ కులపతిగారు కల్పవృక్షాన్ని ఆస్వాదించవలసిన విధానాన్ని

వివరించారు. చిరంజీవి కుమారి కేతవరపు కాత్యాయని 'గిరికుమారుని ప్రేమగీతాల' లోని కులపాలికా ప్రణయ మాధుర్యాన్ని వివరించే వ్యాసాన్ని చదివారు. ప్రసంగాల పిమ్మట పలువురు కవులు ప్రశంసా పద్యాలు చదివారు. శ్రీ కవిసమ్రాట్టులు సముచిత వాత్సల్యభాషణమయ్యాక వందన సమర్పణతో నాటి సభ ముగిసింది.

అధ్యక్షులు శ్రీ శ్రీరామమూర్తిగారన్నట్లు ఈ ఉత్సవాలు ఒక వ్యక్తిగాని ఒక సంస్థగాని చేస్తున్నవి కావు. యావదాంధ్ర లోకానికి సంబంధించినవి. శ్రీ విశ్వనాథ విజయవాడ నివాసులు కాబట్టి అక్కడ జరిగినది. ఎవరో ఒకరు పూనుకోనిదే ఇటు వంటివి జరుగవు. కొందరు సారథ్య సంఘంగా ఏర్పడి పూనుకొన్నారు.

రెండవనాడు ఉదయం శ్రీ విశ్వనాథుల స్వగృహంలో సహస్రచంద్ర దర్శన శాంతి, శతాభిషేకాలు- సూర్యనమస్కారాలు జరిగాయి. భాద్రపద బ. సప్తమి వారి జన్మదినం. గడచినదినంతో ఎనభై ఒక్క సంవత్సరాలు పూర్తి అయినాయి. ఎనభై రెండు ప్రారంభమౌతున్న సప్తమినాడు సంపత్తార అవుతున్న రోహిణి నక్షత్ర సమయంలో ఈ శాంతి జరిగింది. ఇది జరగితేగాని వెయ్యవ పూర్ణచంద్రుణ్ణి చూడ రాదని శాస్త్రవచనం. శాస్త్రోక్తంగా ఈ శాంతి యావదాంధ్ర సాహిత్య భావుకుల తర పున సారథ్య సంఘ మీ కార్యగలాపాన్ని నడిపింది.

శ్రీ విశ్వనాథ దంపతులకు శతాభిషేకం కాగానే శ్రీ శృంగేరీ జగద్గురువులు ఆశీర్వాదాలతో అనుగ్రహించిన నూత్న వస్త్రాలు చదివింపబడ్డాయి. వాటిని ధరించి షోడశమహాదానాలు, నవగ్రహదానాలు నిర్వర్తించారు. కృత్తికానక్షత్రజప సూర్య నమస్కారానుష్ఠాన తీర్థాలను స్వీకరించారు. మహదాశీర్వచనము జరిగింది, ఋత్విక్కు లకు, విద్వాంసులకు సముచిత దక్షిణ సంభావనాసత్కారాలు జరిగినవి. విద్వత్సంభావనా గౌరవాన్ని పొందినవారిలో బ్రహ్మశ్రీ కుప్పాలక్ష్మావధానులుగారు, బ్రహ్మశ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు మొదలైనవారున్నారు.

మొదటినాడువలెనే బంధుమిత్రకోటి. సాహిత్యపరులు సారథ్య సంఘమువారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. మొత్తం నాలుగు పూటలూ పన్నెండువందలమంది భోజనం చేశారు. శ్రీ విశ్వనాథవారి ఏ పుట్టిన రోజుకి ఇంత అన్నశాంతి జరిగి ఉండలేదేమో!

సాయంకాలం సభకు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు శ్రీ యం. ఆర్. అప్పారావుగారు అధ్యక్షత వహించారు. విజయవాడ ప్రభుత్వ కళాశాల ఆంధ్ర శాఖాధ్యక్ష్యులు డా॥ వి. వి. యల్. నరసింహారావుగారు స్వాగత వచనాలు పలికారు. సత్యసుధీరత్న యార్లగడ్డ రంగనాయకులు చౌదరిగారు విశ్వనాథవారి విశిష్ట శబ్దప్రయో గాలను గూర్చి సాధికారికంగా ప్రసంగించారు. బ్రహ్మశ్రీ జమ్ములమడక మాధవరామ శర్మగారు తమ సహజవాక్ప్రవాహంలో శ్రోతల నోలలాడించారు. శ్రీ భూపతిరాజు వేంకటరాజుగారు విశ్వనాథ కవిత్వ రసాత్మకత్వాన్ని ప్రశంసిస్తూ, శృంగారవీధిలోని

'నా కవితన్ విశాల జఘనా!....నీకును నా కభిన్నతా(శ్రీకత కల్గెనా పులకరించును సొమ్ము రస (ప్రపంచముల్' అన్న పద్యాన్ని స్మృతికి తెచ్చినప్పుడు సభ అంతా ఆనందముగ్ధమైంది.

డా॥ వి. వి. యల్. నరసింహారావుగారు వాల్మీకంలో లేకపోయినా కల్ప వృక్షంలో విశ్వనాథులు చేసిన విశేష కల్పనల ఔచిత్యాన్ని జటాయువృత్తాంతాన్ని ఉదాహరిస్తూ ప్రశంసించారు.

శ్రీ భావరాజు నరసింహారావుగారు క్రితంరోజు సారథ్య సంఘ సమావేశంలో నిధి నిర్మాణాన్ని గూర్చి ప్రస్తావించి అప్పటివరకు ఆనుకూల్యాన్ని ప్రకటించిన వ్యక్తులపేర్లు చదివి తక్కినవారి సహకారాన్ని అభ్యర్థించారు. వారు చదివిన పేర్లు ముప్ఫయివరకున్నాయి. కనీసం వందమందయినా చేరితే పదివేల నిధి అవుతుంది. దానిలో విశ్వనాథ సాహిత్యాన్ని గూర్చిన సమీక్షాగ్రంథాలను ప్రకటిస్తూ వాని సమ్మగా వచ్చిన సొమ్ముతో నిధిని పెంచుతూ మరిన్ని మరిన్ని ప్రకటిస్తూ ఉత్తమ సాహిత్య సేవ చేయవచ్చు.

శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తిగారు విశ్వనాథుల కథాకథన దక్షతను గూర్చి అరణ్యకాండలోని గరుడుని కథ ఆధారంగా ప్రసంగం చేశారు. హైదరాబాదులోని B. H. E. L. సంస్థవారు ఈ శాంతి పౌష్టికోత్సవ సందర్భంలో ఒక సంఘంగా ఏర్పడి పూర్వమెప్పుడో మూడురోజులపాటు శ్రీ విశ్వనాథులు తమ సంస్థలో చేసిన ప్రసంగాలను టేప్ రికార్డు చేసి భద్రపరచి ఉన్నవానిని 'సీతాయాశ్చరితం మహత్' అన్న పేరుతో కేవలం సభ్యుల వినియోగానికై ఒక చిన్న పుస్తకంగా అచ్చువేయించి ఆ ప్రతులనూ, తాము పోగుచేసిన ధనాన్నీ శ్రీరామమూర్తిగారు ద్వారా పంపగా వారు ఆ పుస్తకాన్ని శ్రీ అప్పారావుగారిచే ఆవిష్కరింపచేసి ఆ మొత్తాన్ని శ్రీ విశ్వనాథులకు సమర్పించారు.

పిమ్మట 'బ్రాహ్మీమయమూర్తి సాహితీ దర్శనము' అని తామెంతో శ్రమించి ఉత్కృష్టంగా రచించిన తమ గ్రంథాన్ని రచయితలు శ్రీ తాటికొండ వెంకటకృష్ణయ్య, ముదివేడు ప్రభాకరరావుగార్లు సదక్షిణాకంగా భక్తిశ్రద్ధలతో సమర్పించారు. వెంటనే సారథ్య సంఘంవారు శ్రీ విశ్వనాథ దంపతులకు మిక్కిలి విలువైన నూతన వస్త్రాలను చందన తాంబూల ఫల పుష్పాదులతో సమర్పించారు.

శ్రీ విశ్వనాథులకు వేదవిద్యాగురువులైన బ్రహ్మశ్రీ కుప్పా లక్ష్మావధానులుగారు పూర్వపుణ్య సంస్కార బలంచేత విశ్వనాథవారి సాహిత్యం ఎంత వేదార్థానుగుణంగా ఉంటుందో వివరించారు.

రెండవరోజు సభలో గూడా ప్రశంసా పద్యపఠనం జరిగింది. ఉత్సాహపరు

లెంతో మంది ఉన్నా అప్పటికే కాలాతీతమయినందువల్ల కొద్దిమందికే అవకాశం లభించింది.

రాత్రి తొమ్మిదిన్నర కావస్తున్న సమయంలో శ్రీ విశ్వనాథవారు అధికోత్సాహంతో పదేపదే శ్రోతలను నవ్విస్తూ వాత్సల్యభాషణం చేశారు. ప్రధాన కార్యదర్శి వందన సమర్పణతో సభా కార్యక్రమం ముగిసింది.

నాటి సభాధ్యక్షులైన శ్రీ అప్పారావుగారు విశ్వనాథవారు తమ సంస్థలో పనిచేసినవారు కాబట్టి వారు ఎక్కడెక్కడ ఎంతటివారైనా మా కవులంటూ అభిమానంతో ఆదరవాక్యాలు పలికారు. అలా అందరు తెలుగువాళ్లూ అనుకోవలసిన మహాకవులు శ్రీ విశ్వనాథులు. ఈ ఉత్సవాల నిర్వహణతో యావదాంధ్రమూ శ్రీ విశ్వనాథుల యెడ తన విధిని కొంచెంగానైనా నిర్వహించినట్లయింది.

ఈ ఉత్సవాలు ఈ తేదీలలో జరిపితీరాలన్న నిశ్చయంతో 1975 డిశంబరు 14 వ తేదీననే సారథ్య సంఘం ఏర్పడి పత్రికా ప్రకటన చేయించింది. ఆనాడు సభ్యులుగా చేరిన కొద్దిమందీ అనుకొన్న నిర్ణయాల ప్రకారం విశ్వనాథ సాహిత్యాభిమానులని తెలిసిన వ్యక్తుల కందరకూ వ్రాయడం జరిగినా కొద్దిమంది నుండి మాత్రమే సమాధానాలు వచ్చాయి. విజ్ఞప్తి నొకదానిని తయారుచేసి పత్రికలవారికి పంపిస్తే వారు దాన్ని ఏ కారణంచేతనో ప్రకటించలేదు. ఆ విజ్ఞప్తి పత్రాన్నే రెండు వేల ప్రతులు అచ్చు వేయించి సాహిత్యాభిమానులకు, సంస్థలకూ పంపించాము. ఆ తర్వాత కొంత సహకారం లభించింది. కొందరు సారథ్యసంఘ సభ్యులుగా చేరడమేకాక విరాళాలు పోగుచేసి పంపారు. అట్టివారందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఎస్. ఆర్. ఆర్. అండ్ సి. వి. ఆర్. ప్రభుత్వ కళాశాల అధ్యక్షులు శ్రీ లక్ష్మణరావుగారు, ఆంధ్ర శాఖాధ్యక్షులు డా॥ వి. వి. యల్. నరసింహారావుగారు తక్కిన అధ్యాపకవర్గము, విద్యార్థులు మాతో సహకరించిన విధము బహుధాప్రశంసనీయమైనది.

ఇంతటి మహాకవికి ఇట్టి ఉత్సవాలు జరుగుతూ ఉంటే మరే భాషాప్రాంతంలోనైనా పత్రికలవారు ఎన్నెన్నో చేసి ఉండేవారు. మదరాసునుండి వెలువడుతున్న హిందూ ఆంగ్లపత్రికైనా ఒక వ్యాసం ప్రకటించింది. ఇతర పత్రికా సహకారం ఇంత అప్రాప్యమైనా ఈ ఉత్సవాలనిట్లా నిర్వహించగలిగామంటే అది కేవలం పరమేశ్వరానుగ్రహమూ, శ్రీ శృంగేరీ జగద్గురువుల ఆశీర్బలమూ, అనుకోని చోట్ల నుంచి అద్భుత సహకారంతో అన్ని హంగులు అమరి సముచిత వైభవంతో ఉత్సవాలు జరిగాయి.

16-9-76

తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు,
చెఱుకుపల్లి జమదగ్నిశర్మ,
కార్యదర్శులు.